# మరో పదేళ్లు మా ప్రభుత్వమే

- 2036 వరకు రాష్ట్రంలో డీఎంకే పాలనే
- సీఎం స్టాలిన్ ధీమా



స్థానికులతో సీఎం మాటామంతీ

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనే కాదు 2036లో జరుగనున్న ఎన్నికల్లో కూడా డీఎంకే గెలిచి అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. ఊటీలో శుక్రవారం ఉదయం ఎంపీ ఎ.రాజాతో కలిసి ఆయన వాకింగ్‌కు వెళ్ళారు. ఆ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... నీలగిరి జిల్లాల్లో ఐదురోజుల పర్యటన చాలా ఉత్సాహంగా గడించిందని, ఈ జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలను కలుసుకునే అవకాశం కూడా లభించిందన్నారు. డీఎంకే ద్రావిడ తరహా పాలనపై ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలు తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని, ఫ్లవర్‌షోకు మంచి స్పందన వస్తోందని, తొలి రోజే వేల సంఖ్యలో పర్యాటకులు సందర్శించారని తెలిపారు. రాష్ట్ర గవర్నర్‌కు వ్యతిరేకంగా తీర్పునిచ్చిన సుప్రీం కోర్టును రాష్ట్రపతి 14 రకాల ప్రశ్నలతో వివరణ కోరిన అంశంపై త్వరలో బీజేపీయేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించిన మీదట భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అన్నాడీఎంకే బీజేపీతోనే కాకుండా మరిన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆ అపవిత్ర కూటమి ఘోరపరాజయాన్ని చవి చూడకతప్పదన్నారు. వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లోనే కాదు ఇక వరుసగా మరో మూడుసార్లు కూడా రాష్ట్రంలో డీఎంకే పాలనే కొనసాగుతుందని స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు.

## అసెంబ్లీ ఎన్నికలకు డీఎంకే సన్నద్ధం

- కనిమొళి, సెంథిల్‌బాలాజీ సహా ఏడుగురు ఇన్‌చార్జుల నియామకం

ప్యారీస్, మే 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అధికారం డీఎంకే సన్నద్ధమవుతోంది. ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు రాష్ట్రవ్యాప్తంగా 1,244 ప్రచార సభలను నిర్వహించేందుకు ఆ పార్టీ అధిష్ఠానం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈసారి కూడా ఘన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో పార్టీలోని యువజన, మహిళా విభాగాలు సహా అన్ని విభాగాలకు ఎన్నికల బాధ్యతలను అప్పగించింది. మరోవైపు బూత్ కమిటీల నియామకం, అనుభవం కలిగిన వారిని ఈ కమిటీల్లో సభ్యులుగా చేర్చుకోవడం తదితర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఎన్నికల కోసం పార్టీని ఏడు మండలాలుగా విభజించిన అధిష్ఠానం, ఎన్నికలకు సంబంధించి సమర్థవంతంగా పనులు నిర్వహించేందుకు సీనియర్ మంత్రులు కె.నెహ్రూ, ఏవీ వేలు, చక్రపాణి, తంగం తెన్నరసు, పార్లమెంటు సభ్యులు కనిమొళి, ఎ.రాజా, మాజీమంత్రి సెంథిల్‌బాలాజీలను ఇన్‌చార్జులుగా నియమించింది. వీరిలో మంత్రి కేఎన్ నెహ్రూకు తిరుచ్చి, అరియలూరు, పెరంబలూరు, తంజావూరు, నాగపట్నం, తిరువారూర్, మైలాడుదురై జిల్లాలు కేటాయించారు. ఎంపీ కనిమొళికి తూత్తుకుడి, తెన్‌కాశి, కన్నియాకుమారి, తిరునల్వేలి జిల్లాలు, మరో ఎంపీ ఎ.రాజాకు చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాలు, మంత్రి తంగం తెన్నరసుకు శివగంగా, రామనాథపురం, విరుదునగర్ జిల్లాలు, మంత్రి ఏవీ వేలుకు తిరువణ్ణామలై, విల్లుపురం, వేలూరు జిల్లాలు, మంత్రి చక్రపాణికి మదురై దిండుగల్, తేని జిల్లాలు, మాజీ మంత్రి సెంథిల్‌బాలాజీకి కోవై, తిరుప్పూర్ కరూర్, సేలం, ధర్మపురి జిల్లాలు కేటాయించారు.

## ఈసారి ఎన్నికల్లో 50 చోట్ల గెలిచి తీరాల్సిందే

- జిల్లా నేతల సభలో పీఎంకే నేత రాందాస్
- అన్బుమణి సహా పలువురు గైర్హాజరు

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో 50 నియోజకవర్గాల్లో గెలిచి తీరాలని, ఆ దిశగా పార్టీ జిల్లాల నేతలు ఇప్పటి నుండే ప్రచార యుక్తులను అమలు చేయాలని పీఎంకే వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాందాస్ పిలుపునిచ్చారు. విల్లుపురం జిల్లా దిండివనం సమీపం తైలాపురం గార్డెన్‌లో శుక్రవారం ఉదయం పీఎంకే జిల్లా కార్యదర్శులు, జిల్లా ఇన్‌ఛార్జుల సమావేశం రాందాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాందాస్ మాట్లాడుతూ పీఎంకే అధికారంలోకి వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. పీఎంకేని పటిష్టపరచి అధికారంలోకి రావాలనే లక్ష్యంతోనే ఇటీవల చిత్రాపౌర్ణమి సందర్భంగా మహాబలిపురంలో యువజన మహానాడు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా కార్యదర్శుల సమావేశం తర్వాత త్వరలోనే వన్నియార్ల సంఘం, పాట్టాలి యువజన సంఘం, మహిళా సంఘం తదితర పార్టీ విభాగాల సమావేశాలను వరుసగా జరుపనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పీఎంకే గౌరవాధ్యక్షుడు జీకే మణి, ప్రధాన కార్యదర్శి రావణన్, సేలం ఎమ్మెల్యే అరుళ్, వన్నియార్ సంఘం ఇన్‌చార్జి ఎంకే స్టాలిన్, పార్టీ ప్రధాన కార్యాలయం కార్యదర్శి అన్బళగన్ తదితరులు పాల్గొన్నారు.

### అన్బుమణి గైర్హాజరుపై వివరణ

ఈ సమావేశానికి పార్టీ నేత డాక్టర్ అన్బుమణి, పలువురు జిల్లా కార్యదర్శులు, ఇన్‌ఛార్జులు హాజరుకాలేదు. ఈ విషయం గురించి రాందాస్ ప్రస్తావిస్తూ ఇటీవల చిత్రాపౌర్ణమి రోజు జరిగిన యువజన మహానాడులో జిల్లా నేతలంతా పాల్గొని అలసిపోయి ఇంటివద్ద సేదతీరుతున్నారని, ఆ కారణంగానే సమావేశానికి రాలేకపోయారని వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో రాందాస్ మాట్లాడిన తీరు పరిశీలిస్తే ఇకపై పార్టీ ఆయన అజమాయిషీలోనే నడుస్తుందని స్పష్టమవుతోంది. 2026 ఎన్నికల్లో ఎన్నికల పొత్తును కుదుర్చుకుంటామని, ఏయే పార్టీలతో పొత్తుపెట్టుకుంటామనే విషయాన్ని తర్వాత ప్రకటిస్తానని చెప్పారు. ఈ సమావేశంలో రాందాస్ తన తనయుడు అన్బుమణిని పార్టీ కార్యాచరణ అధ్యక్షుడనే సంబోధించడంతో తండ్రీకొడుకుల మధ్య ఇంకా విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయని స్పష్టమవుతోంది.

## నగరంలో ఈడీ తనిఖీలు

- టాస్మాక్ అధికారులు, పారిశ్రామికవేత్తలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ పంజా
- సినీ నిర్మాత నివాసంలోనూ సోదాలు




తేనాంపేటలోని సినీనిర్మాత ఆకాష్‌భాస్కరన్ నివాసగృహం

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్‌లో రూ.1000 కోట్లకు పైగా అవినీతి జరిగిందనే ఆరోపణలపై విచారణ జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు తమ దర్యాప్తులో భాగంగా టాస్మాక్ అధికారులు, కాంట్రాక్టర్ల నివాసాలు, కార్యాలయాలు సహా 10 చోట్ల శుక్రవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు ప్రారంభించారు. తేనాంపేట, చెట్‌పేట్, టి.నగర్, చూళైమేడు, మనపాక్కం ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరిగాయి. మనపాక్కం సీఆర్ పురంలో ఉన్న టాస్మాక్ మేనేజింగ్ డైరెక్టర్ విశాఖన్ నివాసంలో సాయుధ దళాల బందోబస్తు మధ్య ఈడీ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఇదేవిధంగా చూళైమేడు కల్యాణపురంలోని ఎస్ఎన్‌జే కార్యాలయంలోనూ ఈడీ అధికారులు సోదాలు జరిపారు. ట్రిప్లికేన్‌లోని పారిశ్రామికవేత్త దేవకుమార్ నివాసంలో తనిఖీలు నిర్వహించారు. టాస్మాక్ సంస్థలో అక్రమ నగదు బట్వాడా తదితర అవినీతి అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో మార్చి 6 నుండి మూడు రోజులపాటు నిర్విరామంగా తనిఖీలు జరిపారు. ఆ తనిఖీలలో బార్లకు అనుమతులిచ్చే విషయంలోను, టెండర్ల జారీలోను భారీ యెత్తున అవినీతి జరిగినట్లు గుర్తించామని, ఆ అవినీతికి సంబంధించిన కీలక పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నామని ప్రకటించారు. ఇదిలా వుండగా టాస్మాక్ ఎండీ విశాఖన్‌ను నుంగంబాక్కంలోని ఈడీ ప్రధాన కార్యాలయానికి తీసుకెళ్లి అక్కడ విచారిస్తున్నారు.

ఇదిలా ఉండగా 'ఇడ్లీకడై, 'పరాశక్తి' సినిమాలను తీసిన ప్రముఖ నిర్మాత ఆకాష్‌భాస్కరన్ నివాసంలోనూ ఈడీ అధికారులు తనిఖీలు జరిపారు. అక్రమ నగదు బట్వాడా జరిగినట్లు ఆరోపణలు రావటంతో తేనాంపేటలోని ఆయన నివాసంలో ఈ సోదాలు కొనసాగాయని చెబుతున్నారు. నగరమంతటా పది చోట్ల జరిపిన తనిఖీల్లో కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

## చదువుకు వయసు అడ్డం కాదు

- 70ఏళ్ల వయసులో పదిలో ఉత్తీర్ణత!



మార్కుల జాబితాతో కోదండరామన్

వాషర్‌మెన్‌పేట, మే 16 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాలనే తపన ఉంటే దానికి వయసుతో సంబంధం లేదని నిరూపించారు చిదంబరం సమీపంలో 70 ఏళ్ల వృద్ధుడు. కోవిలాంపూండి గ్రామానికి చెందిన కోదండరామన్ (70) అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1965లో 5వ తరగతి పూర్తిచేశాడు. అనంతరం చిదంబరం రామస్వామి చెట్టియార్ మహోన్నత పాఠశాలలో 6వ తరగతి చదివాడు. ఆ సమయంలో తల్లిదండ్రులు మృతిచెందడంతో చదువు కొనసాగించలేకపోయాడు. తల్లిదండ్రుల మరణానంతరం తాతా, బామ్మ సంరక్షణలో ఉన్న కోదండరామన్ మేనమామ రాజగోపాల్ సహాయంతో రైల్వేలో కాంటాక్ట్ కార్మికుడిగా చేరాడు. అప్పుడు అతడి నెల వేతనం రూ.4.35 పైసలు. 1980లో రైల్వేలో ఉద్యోగం పర్మినెంట్ కావడంతో 30 సంవత్సరాలు పనిచేశాడు. పదవీ విరమణ పొందిన అనంతరం 2002లో 8వ తరగతి ఉత్తీర్ణత సాధించి, 2024లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాశాడు. సైన్స్, సోషల్‌లో ఉత్తీర్ణులైన కోదండరామన్, మిగిలిన మూడు పాఠ్యాంశాల్లో ఫెయిలయ్యాడు. అనంతరం తమిళం, మ్యాథ్స్‌లో ఉత్తీర్ణులు కాగా, ఆంగ్లంలో ఫెయిలయ్యాడు. ఈ ఏడాది మళ్లీ పరీక్షలు రాసిన కోదండరామన్ ఆంగ్లంలో కూడా ఉత్తీర్ణులయ్యాడు. ఈ సందర్భంగా కోదండరామన్ మాట్లాడుతూ... చదువుకు వయస్సుతో సంబంధం లేదన్నారు. నన్ను చూసి విద్యార్థులు పోటాపోటీగా పరీక్షలు రాసేందుకు ఆసక్తి చూపారని, ఈ విజయానికి తన కుమారుడు కారణమని కోదండరామన్ తెలిపారు.





పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్



# బాలికలదే పైచేయి

## ప్లస్-1లోనూ..

- 92.09 శాతం ఉత్తీర్ణత
- అరియలూరు ఫస్ట్

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుతో పాటు పుదుచ్చేరిలో నిర్వహించిన ప్లస్-1, పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి శుక్రవారం ఉదయం విడుదల చేశారు. రాష్ట్రంలో రాష్ట్ర పాఠ్యప్రణాళికననుసరించి ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలకు చెందిన ప్లస్-1 విద్యార్థులకు మార్చి 5 నుండి 27 వరకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు రాష్ట్రానికి చెందిన విద్యార్థులతో పాటు పుదుచ్చేరికి చెందిన విద్యార్థులు సహా మొత్తం 8, 07,98 మంది హాజరయ్యారు. ఆ పరీక్షలకు సంబంధించిన ఫలితాలు శుక్రవారం ఉదయం వెలువడ్డాయి. పరీక్షలకు 8,07,098 మంది హాజరుకాగా 7,43,232 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 95.13 శాతం మంది (4,03,949) విద్యార్థినులు. 88.70 శాతం మంది (3,39,283) విద్యార్థులు ఉన్నారు. ఈ పరీక్షలకు 9205 మంది దివ్యాంగులు హాజరుకాగా, 8460 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక వివిధ జైళ్లలో ఉన్న 125 మంది ఖైదీలు ఈ పరీక్షలు రాయగా, వారిలో 113 మంది పాసయ్యారు. ఇదే విధంగా 4326 మంది ప్రైవేటు అభ్యర్థులలో 950 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక రెండు రాష్ట్రాలలోని 7558 ఉన్నత పాఠశాలల్లో 2042 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణతను సాధించాయి. 282 ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణతను సాధించాయి.

### ఐదు జిల్లాల్లో అధికశాతం...

ప్లస్-1 పబ్లిక్ పరీక్షల్లో ఐదు జిల్లాలు అత్యధిక ఉత్తీర్ణతను సాధించాయి. ఆ మేరకు అరియలూరు జిల్లాలో 96.94 శాతం, ఈరోడ్ జిల్లాలో 95.37 శాతం, నాగపట్టినం జిల్లాలో 93.07 శాతం, విరుదునగర్ జిల్లాలో 92.07 శాతం, శివగంగ జిల్లాలో 91.97 శాతం ఉత్తీర్ణతను పొంది తొలి ఐదు స్థానాల్లో అగ్రగామి జిల్లాలుగా నిలిచాయి.

### జీసీసీ స్కూళ్లలో 81 శాతం ఉత్తీర్ణత...

గ్రేటర్ చెన్నైకార్పొరేషన్ పాఠశాలల్లో ప్లస్-1 ఫలితాలలో 81 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మేయర్ ప్రియ ఓ ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 417 పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. కార్పొరేషన్ పాఠశాలల్లో 5361 మంది విద్యార్థులు ప్లస్-1 పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యారని, వీరిలో 2366 బమంది విద్యార్థులు, 2995 మంది విద్యార్థినులు ఉన్నారని తెలిపారు. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో 4340 మంది ఉత్తీర్ణులయ్యారని, ఆమె వివరించారు. గత యేడాది కంటే ఒక శాతం అధికంగా 81 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

### సీఎం, ఈపీఎస్ సహా నేతల శుభాకాంక్షలు...

పదోతరగతి, ప్లస్-1 పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తదితర నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పాసైన విద్యార్థులందరూ తమకు నచ్చిన పాఠ్యాంశాలను ఎంపిక చేసుకుని ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. అదే సమయంలో ఉత్తీర్ణులు కాలేకపోయిన విద్యార్థులు సైతం ఆందోళన చెందకుండా పట్టుదలగా మళ్ళీ పరీక్ష రాసి పాసయ్యేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఇదే విధంగా తమిళగ వెట్రికళగం నేత విజయ్ కూడా పదోతరగతి, ప్లస్-1 పబ్లిక్ పరీక్షలలో పాసైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## టెన్త్‌లోనూ..

- 93.8 శాతం ఉత్తీర్ణత
- శివగంగ జిల్లా అగ్రస్థానం

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికా పదవ తరగతి పరీక్షల్లో 93.8 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రంలో శివగంగ జిల్లా ఉత్తీర్ణతలో మొదటి స్థానంలో నిలిచింది. బాలురు కంటే బాలికలే అధిక శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. తమిళనాడు, పుదుచ్చేరిలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు మార్చి 28 నుంచి ఏప్రిల్ 15 వరకు జరిగాయి. 12,480 పాఠశాలలకు చెందిన 4,46,411 మంది విద్యార్థులు, 4,40,465 మంది విద్యార్థినులు, 25,888 మంది ప్రైవేటు అభ్యర్థులు, 272 మంది ఖైదీలు కలిపి మొత్తం 9,13,036 మంది పరీక్షలు రాశారు. ఈ పరీక్షా ఫలితాలు ఈ నెల 19న విడుదల చేస్తామని ప్రభుత్వ పరీక్షల శాఖ ప్రకటించినప్పటికీ మూల్యాంకన, మార్కుల గణన తదితరాలు పూర్తికావడంతో ఫలితాలు ముందుగానే విడుదలయ్యాయి. కోట్టూరుపురం అన్నా సెంటినరీ లైబ్రరీలో పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ ఫలితాలు విడుదల చేశారు. విద్యార్థినులు 4,17,183 (95.88 శాతం), విద్యార్థులు 4,00,078 (91.74 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది పదవ తరగతి పరీక్షల్లో 91.55 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది 93.8 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

### ఎక్కువ ఉత్తీర్ణత సాధించిన జిల్లాలు...

అధిక ఉత్తీర్ణత సాధించిన జిల్లాల్లో 98.37 శాతంతో శివగంగ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. అలాగే, విరుదునగర్ జిల్లా 97.45 శాతం, తూత్తుకుడి జిల్లా 96.76 శాతం, కన్నియాకుమారి జిల్లా 96.66 శాతం, తిరుచ్చి జిల్లా 96.61 శాతంతో తర్వాత ఐదు స్థానాల్లో నిలిచాయి. 94.85 శాతం ఉత్తీర్ణతతో కాంచీపురం జిల్లా 16వ స్థానం, 90.73 శాతంతో చెన్నై జిల్లా 34వ స్థానం, 89.82 శాతంతో చెంగల్పట్టు జిల్లా 35వ స్థానం, 89.60 శాతంతో తిరువళ్లూర్ జిల్లా 36వ స్థానంలో నిలిచాయి. అలాగే, 85.44 శాతం ఉత్తీర్ణతతో వేలూరు జిల్లా 38వ స్థానం (చివరి స్థానం)లో నిలిచాయి.

### వందకు వంద మార్కులు...

పాఠ్యాంశాల వారీగా 100కి 100 మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య కూడా ఈ ఏడాది పెరిగింది. ఆ ప్రకారం, తమిళంలో 8 మంది, ఆంగ్లంలో 346 మంది, మ్యాథ్స్‌లో 1,996 మంది, సైన్స్‌లో 10,838 మంది, సోషల్ సైన్స్‌లో 10,256 మంది విద్యార్థులు 100కు 100 మార్కులు సాధించారు. 12,290 మంది దివ్యాంగ విద్యార్థులు టెన్త్ పరీక్ష రాయగా, 11,409 ఉత్తీర్ణులయ్యారు. 237 మంది ఖైదీలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. తాత్కాలిక మార్కుల జాబితా ఈ నెల 19వ తేది నుంచి అందజేయనున్నారు.

### చెన్నై కార్పొరేషన్ పరిధిలో...

చెన్నై కార్పొరేషన్ పరిధిలోని 81 పాఠశాలలకు చెందిన 7,142 మంది పరీక్ష రాయగా 6,149 మంది ఉత్తీర్ణులయ్యారు. పాఠ్యాంశాల వారీగా సైన్స్‌లో ఒకరు, సోషల్ సైన్స్‌లో 11 మంది మొత్తం 12 మంది 100కు 100 మార్కులు సాధించారు. సైదాపేటలోని చెన్నై బాలికల మహోన్నత పాఠశాల విద్యార్థి 500 మార్కులకు 492 మార్కులతో ప్రథమ స్థానంలో, బుద్దా వీధిలోని చెన్నై బాలికల మహోన్నత పాఠశాల విద్యార్థి 491 మార్కులతో రెండో స్థానం, చూళైమేడు చెన్నై మహోన్నత పాఠశాల విద్యార్థి 487 మార్కులతో మూడవ స్థానం, సైదాపేట చెన్నై బాలికల మహోన్నత పాఠశాల విద్యార్థి 486 మార్కులతో నాలుగో స్థానం, కామరాజ్ అవెన్యూ చెన్నై మహోన్నత పాఠశాల విద్యార్థి 486 మార్కులతో 5వ స్థానంలో నిలిచారని కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

### జూలై 4 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు...

పది, ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు జూలై 4 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆ ప్రకారం జూలై 4 నుంచి 10వ తేది వరకు, ప్లస్ వన్ పరీక్షలు జూలై 4 నుంచి 11వ తేది వరకు జరుగనున్నాయి. పదవ తరగతికి సంబంధించి జూలై 4న తమిళం, ఇతర భాషా పరీక్షలు, 5న ఐచ్ఛిక పాఠ్యాంశం, 7న ఆంగ్లం, 8న మ్యాథ్స్, 9న సైన్స్, 10న సోషల్ సైన్స్ పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు పరీక్ష జరుగనుంది.

## సమాచార ధ్వని

### షాలిమార్-చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైళ్ల పొడిగింపు

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం షాలిమార్-చెన్నై సెంట్రల్ రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.02841 షాలిమార్-చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19,26, జూన్ 2,9,16,23,30 తేదీల్లో షాలిమార్‌లో సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.02842 చెన్నై సెంట్రల్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 21,28, జూన్ 4,11,18,25, జూలై 2వ తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి తెల్లవారుజామున 4.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.20 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

**సెమ్మేరికుప్పం:** కన్నపాళయం, ఓలిచేరి, పారివాక్కం, పిడారితాంగళ్, బానవేడుతోట్టం, కొలప్పన్ చేరి. **రామాపురం:** రాయల నగర్ 1,2 వీధులు, వళ్లువర్ రోడ్డు జంక్షన్ మరియు నార్త్, భారతి రోడ్డు, భారతి నగర్, ఆండవన్ నగర్, ఎస్ఆర్ఎం యూనివర్శిటీ, తిరుమలై నగర్, ముగలివాక్కం, శబరి నగర్, శ్రీరామ్ నగర్, శుభశ్రీ నగర్, కమల నగర్, ముగలివాక్కం మెయిన్ రోడ్డు, కృష్ణవేణి నగర్, లక్ష్మీ నగర్, ఆశ్రమం అవెన్యూ, ఏజీఎస్ కాలని.

### రూ.1.5 కోట్లతో ఫుట్‌బాల్ మైదానంలో వసతులు

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూర్ నియోజకవర్గం పరిధిలోని 37వ వార్డు ముల్లయ్య నగర్ బస్టాండ్ సమీపంలో ఫుట్‌బాల్ మైదానం ఉంది. వ్యాసర్పాడి, ఎంకేబీ నగర్ సహా పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, యువకులు ఈ మైదానంలో ఫుట్ బాల్ ఆడుతుంటారు. ఫుట్ బాల్ పోటీలు ప్రజలు చూసేందుకు గ్యాలరీ, క్రీడాకారులు దుస్తులు మార్చుకునే గది తదితర వసతులు కల్పించాలని ఆ ప్రాంత యువకులు కార్పొరేషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో, ఈ మైదానంలో రూ.1.5 కోట్లతో గ్యాలరీ, దుస్తులు మార్చుకునే గది ఏర్పాటుకు పెరంబూర్ ఎమ్మెల్యే ఆర్డీ శేఖర్ గురువారం భూమి పూజ చేశారు.

### దుకాణాల్లో వివరణాత్మక వచనంతో 'తిరుక్కురల్'

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో ఉన్న ప్రైవేటు దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో తమిళంలో తిరుక్కురల్ వివరణాత్మక వచనంతో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు చెన్నై జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ విడుదల చేసిన ప్రకటనలో... చెన్నై జిల్లాలోని దుకాణాలు, వాణిజ్య సంస్థలు, ఇతర సంస్థలు తిరుక్కురల్‌ను తమిళంలో ఉంచాలని మార్చి 24న ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, తిరువళ్లువర్ రచించిన తిరుక్కురల్‌ను కార్మికులు, ప్రజలు చదివేలా విధంగా, దాని అర్థాన్ని వివరిస్తూ ప్రతిరోజ ఒక సూక్తి ప్రదర్శనకు ఉంచాలని ఆదేశించినట్లు కమిషనర్ ప్రకటనలో తెలిపారు.

### 8 విమానాల రద్దు

పెరంబూర్, మే 16: స్థానిక మీనంబాక్కం నుంచి వివిధ నగరాలకు వెళ్లాల్సిన ఎనిమిది విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. తిరుచ్చి, తూత్తుకుడి, మదురై, శివమొగ్గ తదితర నగరాలకు వెళ్లాల్సిన నాలుగు విమానాలు, మీనంబాక్కం ఆ నగరాలకు వెళ్లాల్సిన నాలుగు విమానాల సహా మొత్తం 8 విమానాలు రద్దయ్యాయి. నిర్వహణ కారణాలతో విమానాలు రద్దయినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. ముందుగా ఈ సమాచారం ముందుగాను ఎందుకు తెలుపలేదని ప్రయాణికులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు.

### రూ.40 కోట్లతో గ్రంథాలయాలకు పుస్తకాలు

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3,873 ప్రభుత్వ గ్రంథాలయాలకు రూ.40 కోట్లతో పుస్తకాల కొనుగోలుకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రాష్ట్రంలో గ్రంథాలయాలకు పుస్తకాల కొనుగోలులో భారీ అవినీతి జరిగిందని, ఆన్‌లైన్‌లో పుస్తకాలు కొనుగోలు చేయాలని విద్యావేత్తలు ప్రభుత్వానికి సూచించారు. దీనిపై దృష్టి సారించిన ప్రభుత్వం, గ్రంథాలయాలకు పుస్తకాల కొనుగోళ్లు ఆన్‌లైన్‌లో చేపట్టాలని, అందుకు ప్రచురణ సంస్థలు, రచయితలు దరఖాస్తు చేయాలని కోరింది. ఇప్పటివరకు ఆన్‌లైన్ ద్వారా 414 ప్రచురణ సంస్థల నుంచి దరఖాస్తులందాయి. ఈ క్రమంలో, గ్రంథాలయాలకు రూ.40 కోట్లతో 6,416 శీర్షికలతో 22,17,379 పుస్తకాలు కొనుగోలు చేయనున్నట్లు, మరో నెలరోజుల్లో కొత్త పుస్తకాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

### తుర్కియే, చైనా ఉత్పత్తులు బాయ్‌కాట్ చేయాలి

● తంగుటూరి రామకృష్ణ పిలుపు

అడయార్, మే 16 (ఆంధ్రజ్యోతి): భారత్‌పై ద్వేషాన్ని పెంచుకున్న తుర్కియే, చైనా, అజర్‌బైజాన్ దేశాలకు చెందిన వస్తు ఉత్పత్తులను బాయ్‌కాట్ చేయాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ విషయంపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ మనదేశంపైకి యుద్ధానికి వచ్చే, వారికి తుర్కియే వంటి దేశాలు సాయం చేశాయన్నారు. ఇలాంటి ద్వేషభావం కలిగిన తుర్కియే, చైనా, అజర్‌బైజాన్‌లకు చెందిన వస్తువులను బాయ్‌కాట్ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే తుర్కియే యాపిల్స్‌ను భారత వ్యాపారులు కొనుగోలు చేయడం మానేశారని, అదేవిధంగా ప్రతి ఒక్కరూ ఆ మూడు దేశాల ఉత్పత్తులను బాయ్‌కాట్ చేయాలని తంగుటూరి రామకృష్ణ పిలుపునిచ్చారు.

### ఉద్యోగులు, పెన్షనర్లకు పెంచిన 4 నెలల డీఏ చెల్లింపు

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు పెంచిన కరువుభత్యం అమల్లులోకి వచ్చిందని ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేసింది. శాసనసభలో ముఖ్యమంత్రి స్టాలిన్ జనవరి నుంచి వర్తించేలా ఉద్యోగులకు 2 శాతం కరవుభత్యం పెంచనున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులకు పెంచిన కరువుభత్యం నాలుగు నెలల బకాయిలను మే నెల జీతంతోపాటు చెల్లించనున్నట్లు ప్రకటించింది.

# కోలాహలంగా భద్రకాళి అమ్మవారి ఉత్సవాలు

● వినూత్నంగా మొక్కులు చెల్లించిన భక్తులు

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా విలాత్తికుళం సమీపం చోళపురం గ్రామంలో అరుళ్‌మిగు భద్రకాళి అమ్మవారి ఆలయం ప్రసిద్ధిచెందింది. ఈ ఆలయంలో ప్రతి ఏడాది చిత్రా పౌర్ణమి వేడుకలు కోలాహలంగా నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, ఈ ఏడాది వేడుకలు ఈ నెల 13న ప్రారంభమయ్యాయి. ఆలయానికి వచ్చిన భక్తులు, అమ్మవారికి 9 రకాల అభిషేకాలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం 'మట్టి పండుగ' జరిగింది. బాలురు, పురుషులు సుమారు 500 మంది తమ శరీరమంతా మట్టి పూసుకుని, వేపాకులు పట్టుకుని గ్రామ శివారులోని చెరువు నుంచి వీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నృత్యం చేసిన భక్తులు, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



శరీరంపై బురద పూసుకున్న భక్తులు

## నగర పంచాయతీ అధ్యక్ష పదవి నుంచి తొలగింపు

● హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, మే 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీలకు కేటాయించిన వార్డులో పోటీచేసి విజయం సాధించిన అన్నాడీఎంకేకు చెందిన తేరూర్ పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు అముదరాణి ఎన్నిక చెల్లదని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించింది. కన్నియాకుమారి జిల్లా తేరూర్ పట్టణ పంచాయతి అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్న అన్నాడీఎంకేకు చెందిన అముదరాణి ఎస్సీ వర్గానికి చెందినవారు. 2005లో క్రైస్తవ మతం ప్రకారం వివాహం చేసుకున్నారు.ఆమె పిల్లలకు క్రైస్తవులు అంటూ (బీసీ) కుల ధృవీకరణ పత్రం పొందారు. ఈ క్రమంలో, 2022లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ (జనరల్)కు కేటాయించిన వార్డు నుంచి అముదరాణి పోటీచేసి గెలుపొందారు. అనంతరం ఆమె అధ్యక్షురాలుగా ఎంపికయ్యారు. ఈ వ్యవహారంలో అముదరాణికి వ్యతిరేకంగా మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. విచారణ పూర్తికావడంతో శుక్రవారం న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులో... ఎస్సీలకు కేటాయించిన వార్డులో పోటీచేసి విజయం సాధించిన అముదరాణి ఎన్నిక చెల్లదు. క్రైస్తవ మతాచారం ప్రకారం వివాహం చేసుకున్న తర్వాత ఎస్సీ అని చెప్పి ప్రభుత్వ రాయితీ అనుభవించడం నేరం. ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీలకు పావులుగా మారి, ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది.

## మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఏసీబీ తనిఖీలు

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): తంజావూరులోని అన్నాడీఎంకే మాజీ శాసన సభ్యుడు, ప్రస్తుతం అమ్మామక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి ఎం. రంగసామి నివాసంలో శుక్రవారం ఉదయం ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు జరిపారు. పాపానాశం తాలూకా పూండి సమీపంలో మలయర్ నత్తం గ్రామానికి చెందిన రంగసామి ప్రస్తుతం తంజావూరు దళవాయిపాళయం వీరయ్యనగర్‌లో నివసిస్తున్నారు. 2011లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో గెలిచారు. 2016లోను గెలిచి టీటీవీ దినకరన్ వర్గంలో చేరారు. ఆ తర్వాత ఎడప్పాడి పళనిస్వామి ప్రభుత్వానికి మద్దతు ప్రకటించకుండా అర్హత కోల్పోయిన 18 మంది ఎమ్మెల్యేల్లో రంగసామి కూడా ఉన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆదాయానికి మించి అక్రమార్జనకు పాల్పడ్డారనే ఆరోపణలపై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు, పోలీసులు 10 మంది రంగసామి నివాసంలో శుక్రవారం ఉదయం తనిఖీలు ప్రారంభించారు.



తంజావూరులో మాజీ ఎమ్మెల్యే రంగసామి బంగళా

● వాటర్‌ట్యాంకులో మానవ వ్యర్థాలు...

## ఇద్దరు యువకుల విచారణ

ప్యారీస్, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ గౌండనాయకన్ పాళయం ప్రాంతంలోని వాటర్‌ట్యాంకులో మానవ వ్యర్థాలు కలిపిన వ్యవహారం ఆలస్యంగా వెలుగు చూసింది. దీనికి సంబంధించి పోలీసులు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. తిరుప్పూర్ కార్పొరేషన్ 6వ వార్డు గౌండనాయకన్ పాళయంలో వాటర్‌ట్యాంకు ఉంది. ఇటీవల వాటర్‌ట్యాంకుపై నుంచి నలుగురు యువకులు మద్యం మత్తులో కిందకి దిగొచ్చి గ్రామస్థులను చూసి తప్పించుకునేందుకు యత్నించారు. నలుగురిలో ఇద్దరు యువకులు పారిపోగా, ఇద్దరు పట్టుబడ్డారు. అదేప్రాంతానికి చెందిన నిషాంత్, సంతోష్ లను తిరుప్పూర్ ఉత్తర పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో నలుగురు స్నేహితులు వాటర్‌ట్యాంకు పైకి ఎక్కి మద్యం సేవించిన అనంతరం ట్యాంకులోకి దిగి స్నానం చేసి, మలమూత్రాలను విసర్జించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో, తాగునీటి తొట్టిలో మానవ వ్యర్థాలు కలిపిన సంఘటనపై గౌండనాయకన్ పాళయంలో శుక్రవారం గ్రామస్థులు రాస్తారోకో నిర్వహించారు. తమ ప్రాంతంలోవున్న వాటర్ ట్యాంక్‌కు సెక్యూరిటీ గార్డును నియమించాలని డిమాండ్ చేశారు. పోలీసులు వారితో చర్చించి సమస్య ఎరిష్కరింపజేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికే వేంగైవాయిల్ ప్రాంతంలోని వాటర్‌ట్యాంకులో మానవ వర్థాలు కలిపిన సంఘటన ఇంకా సర్దుమనగని నేపథ్యంలో, ప్రస్తుతం తిరుప్పూర్‌లో ఇలాంటి సంఘటన చోటుచేసుకోవడం కలకలంరేపింది.



విచారణ జరుపుతున్న పోలీసులు

## సుప్రీంకోర్టులో రాష్ట్రపతికి చుక్కెదురే

● డీఎంకే ఎంపీ విల్సన్

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపాదించే బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్రపతికి కూడా గడువు విధించడం సబబు కాదంటూ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము సుప్రీం కోర్టును వివరణ కోరటాన్ని ఆ సర్వోన్నత న్యాయస్థానం పట్టించుకునే అవకాశం లేదని సీనియర్ న్యాయవాది, డీఎంకే ఎంపీ విల్సన్ పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రస్తుతం లేవనెత్తిన 14 ప్రశ్నలకు రాష్ట్ర గవర్నర్ ఆర్‌రవికి వ్యతిరేకంగా దాఖలైన కేసులో ఇచ్చిన తీర్పులో చక్కటి సమాధానాలున్నాయని తెలిపారు. కావేరి నదీజలాల వివాదం సందర్భంలో ఇలాంటి పరిస్థితే ఎదురైనప్పుడు సుప్రీం కోర్టు పెద్దగా పట్టించుకోలేదని, జోక్యమూ చేసుకోలేదన్నారు. గుజరాత్ రాష్ట్రానికి సంబంధించిన కొన్ని కేసులను ఉదాహరణగా తీసుకుంటే రాష్ట్రపతి కోరికను సుప్రీం కోర్టు నిరాకరిస్తుందన్నారు. ఈ కేసుపై పునఃసమీక్ష పిటిషన్ దాఖలయితే తిరస్కరణకు గురవుతుందని కేంద్ర ప్రభుత్వానికి సుస్పష్టంగా తెలుసుననని ఆయన తెలిపారు. ఈ కారణాల వల్లే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా తీవ్ర ఒత్తిడి చేసినా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులో మార్పులు చేయడానికిగానీ, పూర్తిగా నిలిపి ఉంచడానికిగానీ ప్రయత్నించే ప్రసక్తే లేదని విల్సన్ స్పష్టం చేశారు.

## దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న వజ్రం స్థానంలో నకిలీది

● పోలీసులపై వజ్రాల వ్యాపారి ఫిర్యాదు

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): దోపిడీ దొంగలు చోరీచేసిన రూ.23 కోట్ల విలువైన వజ్రానికి బదులు నకిలీ వజ్రాన్ని కోర్టులో సమర్పించి పోలీసులు తనను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ అన్నానగర్‌కు చెందిన వజ్రాల వ్యాపారి చంద్రశేఖర్ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న చంద్రశేఖర్ కొంతమంది బ్రోకర్ల సహాయంతో వడపళనిలోని స్టార్‌హోటల్‌కు తన దగ్గరున్న వజ్రాన్ని విక్రయించేందుకు వెళ్లాడు. ఆ సమయంలో బ్రోకర్లకు బదులుగా నలుగురు వ్యక్తులు గదిలోకి వచ్చి చంద్రశేఖర్‌ను తాళ్లతో నిర్బంధించి ఆయన దగ్గరున్న రూ.23 కోట్ల విలువైన వజ్రాన్ని అపహరించుకెళ్ళారు. చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు 24 గంటల్లోనే తూత్తుకుడిలో వ్యాన్‌లో పారిపోతున్న ఐదుగురు దోపిడీ దొంగలను అరెస్టు చేసి వారి దగ్గరున్న వజ్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అప్రైజర్ల పరిశీలన తర్వాత ఆ వజ్రాన్ని పోలీసులు సైదాపేట కోర్టులో సమర్పించారు. ఈ నేపథ్యంలో పోలీసులు నకిలీ వజ్రాన్ని సైదాపేట కోర్టులో అప్పగించినట్లు వజ్రాల వ్యాపారి చంద్రశేఖర్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దోపిడీ దొంగల బారి నుండి స్వాధీనం చేసుకున్న రూ.23 కోట్ల విలువైన వజ్రానికి బదులుగా పోలీసులు నకిలీ వజ్రాన్ని కోర్టులో సమర్పించారని, ఆ విషయమై ఫిర్యాదు చేయడానికి తన కుమార్తె జానికి వడపళని పోలీసుస్టేషన్‌కు వెళ్ళినప్పుడు అక్కడి పోలీసు ఉన్నతాధికారులు ఆమెను తీవ్రంగా బెదరించి తరిమికొట్టారని ఆయన ఆరోపించారు. దోపిడీకి గురైన వజ్రం లాగే పోలీసులు నకిలీ వజ్రాన్ని తయారు చేసి సైదాపేట కోర్టులో సమర్పించారని ఆ ఫిర్యాదులో ఆయన ఆరోపించారు. ఈ భారీ మోసానికి పాల్పడిన వడపళని పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రశేఖర్ ఆ ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

## అదనంగా రూ.25 వసూలు

● ఇంటికే వెళ్లి కిలో స్వీట్లు ఇవ్వాలని ఫోరం ఆదేశం

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): అదనంగా రూ.25 వసూలుచేసిన మిఠాయి అంగడి నిర్వాహకులు, పిటిషనర్ ఇంటికే వెళ్లి కిలో మిఠాయిలు అందజేయాలని వినియోగదారుల ఫోరం ఆదేశించింది. కీల్పాక్కంకు చెందిన రవిశంకర్ చెన్నై ఉత్తరం వినియోగదారుల ఫోరంలో దాఖలుచేసిన పిటిషన్‌లో... కీల్పాక్కం ఆర్మ్స్ రోడ్డులో ఉన్న ప్రముఖ మిఠాయి దుకాణంలో గత ఏడాది జూన్ 2న 250 గ్రాముల 'బాదం పిస్తా రోల్' కొనుగోలు చేశాను. కిలో రూ.1,700 అని చెప్పడంతో, 250 గ్రాములకు చెల్లించాల్సిన రూ.425ను క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించాను. కానీ, దుకాణదారులు రూ.425కు బదులు రూ.450 వసూలుచేశారు. ఇదేమిటని వారిని ప్రశ్నించి, అదనపు సొమ్ము తిరిగివ్వాలని అరగంట సేపు పోరాడాను. బిల్లు చేసే యంత్రంలో జరిగిన సాంకేతికలోపమన్న సిబ్బంది, అదనంగా వసూలుచేసిన నగదు తిరిగి చెల్లించారు. అదనంగా వసూలు చేయడం, అందువల్ల నాకు కలిగిన మానసిక ఒత్తిడికి రూ.5 లక్షలు నష్టపరిహారం ఇప్పించాలని రవిశంకర్ పిటిషన్‌లో కోరాడు. ఈ పిటిషన్ గురువారం విచారించిన ఫోరం అధ్యక్షులు టి.గోపినాథ్, సభ్యులు కవితా కన్నన్ వినియోగదారుడి నుంచి వసూలుచేసిన అదనపు నగదు తిరిగి చెల్లించినా, ఇలాంటి చర్యలు వినియోగదారుల సేవల్లో లోపం ఉన్నట్లు తెలుస్తుందన్నారు. ఏదిఏమైనా పిటిషనర్‌కు ఏర్పడిన మానసిక ఒత్తిడి తగ్గించేలా 15 రోజుల్లో కిలో బాదం పిస్తా రోల్ అతని ఇంటికే వెళ్లి అందించాలని దుకాణ దారులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

### ప్రభుత్వ పాఠశాలలో తనిఖీలు



వేలూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): వేలూరు గుడియాత్తంలోని పాఠశాలల్లో సబ్ కలెక్టర్ శుభలక్ష్మి ఆదేశాల మేరకు ట్రాన్స్‌పోర్టు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో సుమారు 30కి పైగా పాఠశాలల్లోని బస్సులను బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ కన్నా పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి సుందరరాజన్ సహా పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

### రాజమునీశ్వరుడికి కలశాభిషేకం



ఆలయానికి కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

వేలూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాగితపట్టరైలో కొలువైన రాజ మునీశ్వరాలయంలో స్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 108 పాల కలశాలతో భక్తులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.. ఆలయ అర్చకుల వేదమంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాల నడుమ మునీశ్వరస్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రంగనాథన్, యశోద, అర్చకులు శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

### శక్తి క్లినిక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేలూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తంలోని గోపాలపురంలో శుక్రవారం ఉదయం పుదుపేట శక్తి క్లినిక్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు ధనుంజయ్ అధ్యక్షత వహించగా, గంగమ్మ ఆలయ అధ్యక్షుడు కార్తికేయన్ ఈ ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దేవకి, వేలూరు ప్రభుత్వాసుపత్రి డాక్టర్లు, మెడికల్ సిబ్బందితో పాటు పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

### భవన నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించాలి



నిరసన కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న ఇంజనీర్లు

వేలూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): పెరిగిన భవన నిర్మాణ సామగ్రి ధరలను తగ్గించాలంటూ వేలూరులో భవన నిర్మాణ ఇంజనీర్ల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఉదయం వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ ధర్నాలో సంఘ అధ్యక్షుడు వేల్‌రాజ్ మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం భవన నిర్మాణ సామగ్రి ధరలు పెంచి, అటు కార్మికులకు ఇటు ఇంజనీర్లకు తీరని ద్రోహం తలపెడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ల సంఘ కార్యదర్శి సురేష్, ట్రెజరర్ కరుణామూర్తి, మాజీ అధ్యక్షుడు వెంకటేశన్, శక్తివేల్ తదితరులు పాల్గొన్నారు.

### అన్నా విశ్వవిద్యాలయానికి బాంబు బెదిరింపు

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలో ఉన్న అన్నా విశ్వవిద్యాలయానికి గురువారం రాత్రి బాంబు బెదిరింపు వచ్చింది. ఈ-మెయిల్ ద్వారా వచ్చిన సమాచారాన్ని వర్సిటీ అధికారులు కోట్టూరుపురం పోలీసులకు తెలియజేశారు. డాగ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకున్న పోలీసులు వర్సిటీ ప్రాంగణమంతా గాలించి ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదుచేసి, ఈ-మెయిల్ పంపిన చిరునామా కోసం విచారిస్తున్నారు. కాగా, అన్నా విశ్వవిద్యాలయానికి 17వ సారి ఇలాంటి బెదిరింపు రావడం గమనార్హం.

### రామేశ్వరం సమీపంలో ఎగిరిన డ్రోన్

● ఇంటెలిజెన్స్ పోలీసుల విచారణ

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సమీపంలోని సముద్రంలో ఎగిరిన డ్రోన్ వ్యవహారంపై ఇంటెలిజెన్స్ పోలీసులు విచారిస్తున్నారు. రామేశ్వరానికి అతి దగ్గరగా శ్రీలంక సముద్ర ప్రాంతం ఉండడంతో ముఖ్యమైన ప్రాంతంగా పరిగణిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రామేశ్వరం సమీపంలోని భారత సముద్ర సరిహద్దులోని ప్రాంతాల్లో గురువారం ఓ డ్రోన్ ఎగిరినట్లు నావికాదళం రాడార్‌లో నమోదైంది. దీంతో, భారత నావికాదళం, రామేశ్వరంలోని కేంద్ర, రాష్ట్ర నిఘా విభాగం పోలీసులు రామేశ్వరం సమీపంలోని భారత సముద్ర సరిహద్దు ప్రాంతాలకు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో, రామేశ్వరం సముద్ర ప్రాంతంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై డ్రోన్ ద్వారా సమాచారం సేకరించినట్లు తెలియడంతో పర్యటక సంస్థ అధికారులను ఇంటెలిజెన్స్ పోలీసులు విచారిస్తున్నారు.

### ఉయ్యాల ఊగుతూ మృత్యు ఒడిలోకి

● చీర గొంతుకు చుట్టుకుని విద్యార్థిని మృతి

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉయ్యాల ఊగుతున్న సమయంలో చీర గొంతుకు బిగుసుకుని పాఠశాల విద్యార్థిని మృతిచెందిన ఘటన తిరువణ్ణామలై జిల్లాలో చోటుచేసుకుంది. ఆరణి సమీపం ఈబీ నగర్ ప్రాంతానికి చెందిన మురుగన్-రేఖ దంపతుల కుమార్తె భాగ్య (11) వేసవి సెలవులు కావడంతో ఇంటిముందు చీరతో ఉయ్యాల కట్టుకుని పిల్లలతో కలసి ఊగుతోంది. ఆ సమయంలో చీర భాగ్య గొంతుకు చుట్టుకోవడంతో ఆమె స్పృహ తప్పింది. చుట్టుపక్కల వారు ఆమెను వెంటనే ఆరణి ప్రభుత్వాసుపత్రికి తరలించి, అప్పటికే భాగ్య మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

### మహిళగా నటించి మోసం: ముగ్గురి అరెస్టు

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): మహిళగా నటించి యువకుడిని మోసం చేసిన వ్యవహారంలో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరునల్వేలి జిల్లా మానూర్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఒంటరిగా ఉండడంతో తన సెల్‌ఫోన్‌లో 'గ్రిండర్' ఛాటింగ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ఈ క్రమంలో, అతడితో ఓ మహిళ ఛాట్ చేయడం ప్రారంభించింది. కొద్దిరోజుల్లోనే ఆ మహిళతో యువకుడికి పరిచయం ఏర్పడింది. ఒకరోజు ఆ మహిళ, ఒంటరిగా కలుసుకోవాలని చెప్పడంతో ఆ యువకుడు మహిళ చెప్పిన ప్రాంతానికి చేరుకోగా అక్కడ నిర్మానుష్యంగా ఉంది. కొద్దిసేపటికి ఓ ముఠా అక్కడకు చేరుకుని యువకుడిని బెదిరించి అతని సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం దోచుకుని పరారయ్యారు. ఈ వ్యవహారంపై బాధితుడి ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు, ఆన్‌లైన్ యాప్ ద్వారా యువతిగా పరిచయం చేసుకుని మోసం చేసిన పాళయంకోటకు చెందిన నల్లముత్తు, ముత్తుకుమార్, జయరాజ్‌లను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

### బాలికపై లైంగిక వేధింపులు

● పారిశ్రామికవేత్తపై పోక్సో కేసు

ప్యారీస్, మే 16 (ఆంధ్రజ్యోతి): కోవై జిల్లా పొల్లాచ్చిలో బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడి పరారైన పారిశ్రామికవేత్తపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పొల్లాచ్చిలో తాళ్ల ఎగుమతుల కంపెనీ నడుపుతున్న అరుణ్‌కుమార్ దగ్గర సుమారు 30 మందికి పైగా పని చేస్తున్నారు. వీరిలో తల్లిదండ్రులతో పాటు 17 ఏళ్ళ బాలిక కూడా పనికి వెళ్తుండేది. ఇటీవల తనను లైంగిక వేధింపులకు గురిచేసినట్లు ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పొల్లాచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలిసి, అజ్ఞాతంలోకి జారుకున్న అరుణ్‌కుమార్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, అతడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లైంగిక వేధింపుల కేసులో..

### కరస్పాండెంట్, టీచర్‌కు జైలు శిక్ష

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో కరస్పాండెంట్‌కు 23 ఏళ్ల, తమిళ టీచర్‌కు 43 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. దిండుగల్ జిల్లా కులిజియంపారై అలంపాడికి చెందిన యువరాజ్ (41) కరూర్ జిల్లా పాపిరెడ్డిపట్టి కావేరి మెట్రిక్యులేషన్ పాఠశాల కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. తిరుచ్చి జిల్లా ముసిరి పార్వతీపురానికి చెందిన నిలవాళి (42) ఆ పాఠశాలలో తమిళ ఉపాధ్యాయుడిగా ఉన్నారు. 2022లో ఓ విద్యార్థినిని ఇద్దరూ కలిసి లైంగిక వేధింపులకు గురిచేసినట్లు సమాచారం. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో, లాలాపేట పోలీసులు యువరాజ్, నిలవాళిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో వాదోపవాదాలు పూర్తికావడంతో నిందితులు నిలవాళికి 43 ఏళ్ల, యువరాజ్‌కు 23 ఏళ్ల జైలుశిక్ష, ఇద్దరికి తలా రూ.1,000 జరిమానా విధిస్తూ కరూర్ అదనపు మహిళా న్యాయస్థానం న్యాయమూర్తి తంగవేలు గురువారం తీర్పు చెప్పారు. అలాగే బాలికకు రూ.7 లక్షలు నష్టపరిహారంగా అందజేయాలని ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేశారు.

### సూలూరు వైమానికదళంలో చొరబడిన యువకుడి అరెస్టు

టి.నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా సూలూరు వైమానిక దళంలో చొరబడిన యువకుడిని భద్రతాధికారులు నిర్బంధించి పోలీసులకు అప్పగించారు. సూలూరు వైమానిక దళంలో తేజస్ యుద్ధ విమానాలు వస్తుంటాయి. ఆ వైమానికి దళం చుట్టూ ఎత్తయిన ప్రహరీ, అన్ని వైపులా సీసీ కెమెరాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో 30 యేళ్ల యువకుడు ఆ వైమానికి దళం ప్రహరీగోడపైకెక్కి లోపలకు చొరబడ్డాడు. గమనించిన భద్రతాధికారులు వెంటనే వెళ్ళి అతడిని నిర్బంధించారు. అతడిని ప్రశ్నించగా పొంతన లేకుండా సమాధానాలు తెలిపాడు. దీంతో ఆ యువకుడిని సూలూరు పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్ళి పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలోనూ అతడి వివరాలను తెలుసుకోలేకపోయారు. దీనితో ఆ యువకుడు మానసిక రోగిగా ఉంటాడని అనుమానిస్తున్నారు.



అరెస్టయిన యువకుడు

### వాటర్ ఫాల్స్ వద్ద విషాదం

● తల్లిదండ్రుల కళ్ళెదుటే కొట్టుకుపోయిన బిడ్డలు

అడయార్, మే 16 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా ఏర్కాడులోని పులియంగాడు వాటర్ ఫాల్స్‌లో తీవ్ర విషాదకర ఘటన జరిగింది. ప్రముఖ పర్యాటక ప్రాంతం ఏర్కాడులో ఇద్దరు చిన్నారులు తల్లిదండ్రుల కళ్ళెదుటే నీటి ప్రవాహంలో కొట్టుకునిపోయారు. సేలం జిల్లా కె.పుత్తూరుకు చెందిన వెంకట్రామన్, గోవిందమ్మాళ్ దంపతులకు దీపక్ (15), కామేష్ (12) అనే ఇద్దరు కుమారులున్నారు. వేసవి సెలవులు కావడంతో వెంకట్రామన్ కుటుంబం విహారయాత్ర కోసం జిల్లాలోని పులియంగాడు అనే ప్రాంతంలో ఉన్న వాటర్ ఫాల్స్‌కు వెళ్ళారు. భార్యాభర్తలిద్దరూ గట్టున ఉండగా, పిల్లలు నీటిలో ఉన్నారు. ఆ సమయంలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో వారిద్దరూ కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు.. చిన్నారుల మృతదేహాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

### కుమరిలో వడదెబ్బకు ముగ్గురి మృతి

ప్యారీస్, మే 16 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో పిల్లల నుండి పెద్దల వరకు రోడ్లపైకి రాకుండా ఇళ్లకే పరిమితమవుతున్నారు. మధ్యాహ్నం వీధుల్లో వేడి గాలులు వీస్తుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కలియకావిలై సమీపంలో తిరుతువపురంలో ముగ్గురు వడదెబ్బకు మరణించిన సంఘటన స్థానికులను ఆందోళనకు గురిచేసింది. మనో జయన్ (47), కలైమణి (47), సంతోష్ (46)అనే ఈ ముగ్గురు ఈ నెల 14వ తేదీ అనారోగ్యం కారణంగా చికిత్స కోసం మార్తాండంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అయితే, చికిత్స ఫలించక శుక్రవారం మరణించినట్లు వైద్యులు తెలిపారు.



మృతుల (ఫైల్‌ఫొటో)



ఎన్నికల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జి.శశిధర్ రెడ్డి, మాదాల ఆదిశేషయ్య, వడ్లమూడి దిలీప్‌కుమార్ తదితరులు

# ఆస్కా అభివృద్ధి కోసం మాకు ఓటెయ్యండి

● మెంబర్స్ వాయిస్ ప్యానల్ విజ్ఞప్తి

ప్యారీస్, మే 16 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్ర సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్' (ఆస్కా) అభివృద్ధి కోసం తమ ప్యానెల్‌కు ఓటేయాలని 'మెంబర్స్ వాయిస్ ప్యానల్' సభ్యులకు విజ్ఞప్తి చేసింది. ఆదివారం జరుగనున్న ఈ ఎన్నికల్లో మెంబర్స్ వాయిస్ ప్యానల్ తరఫున 24 మంది పోటీ చేయనున్నారు. అధ్యక్ష పదవికి జి.శశిధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వై.రాజేశ్వరరావు, కార్యదర్శిగా వడ్లమూడి దిలీప్‌కుమార్, ఉప కార్యదర్శిగా మాదాల వెంకట సుబ్బారావు, కోశాధికారిగా ఎల్.శాంతకుమార్, కల్చరల్ సెక్రటరీగా సినీ నటుడు ఎం.భానుచందర్ పోటీ చేస్తున్నారు. అదే విధంగా కమిటీ సభ్యులుగా మన్నూరు చలపతి, డి.రవిచందర్, మదన గోపాల్‌రావు, పి.ప్రేమ్‌కుమార్, రమేష్ రెడ్డి, దుర్గా ప్రసాద్, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, టి.రాజేష్, ఎస్‌పి. శ్రీనివాస్, ట్రస్టీలుగా ముంద్రు శ్రీనివాసరావు, కోటారెడ్డి వేమిరెడ్డి, వి.విజయేందర్‌రావు, పి.సంతోష్‌కుమార్, బీవీఎస్ కోటేశ్వరరావు, పి.మోహన్‌రెడ్డి, ఎన్.భిక్షం, వి.బాలాజీ, వి.ప్రశాంత్ పోటీ చేస్తున్నారు. ఈ ప్యానల్ నుంచి అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న శశిధర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం ఆస్కా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆ బృందం ప్రణాళిక వివరించారు. సంప్రదాయ తెలుగు వంటకాలతో పాటు ఇతర సంస్కృతుల వంటకాలను అందించడం, సత్ కమిటీల్లో యువత, మహిళలకు ప్రాధాన్యత, దేశంలోనే ఇతర క్లబ్‌లతో ఆస్కాను అనుసంధానం చేసి అభివృద్ధి చేస్తామన్నారు. ఆస్కాలో ప్రస్తుతం 2,600 మందికి పైగా ఓటు హక్కు కలిగివున్నారని, తమ టీమ్‌ను గెలిపిస్తే క్లబ్‌ను సమష్టి కృషితో అభివృద్ధి చేస్తామన్నారు. సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్న దృక్పథంతోనే తమ ప్యానల్‌కు మెంబర్స్ వాయిస్‌గా పేరు సూచించినట్లు తెలిపారు. ఆస్కా అభివృద్ధికి కృషిచేసిన పెద్దలు మాదాల ఆదిశేషయ్య, ఆర్వీ సత్యనారాయణ, యలమంచి శరత్‌బాబు, ఎం.రామమోహన్‌రావు, ఆర్.సాంబశివరావు తదితరుల ఆశీస్సులతో తాము పోటీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## నేటినుంచి కొడైకెనాల్‌లో పారా సెయిలింగ్ ప్రారంభం



పారా సెయిలింగ్ రిహార్సల్స్

టి.నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో పర్యాటకులను మరింతగా ఆకట్టుకునే రీతిలో శనివారం నుండి పారా సెయిలింగ్ (పారాచూట్‌తో సాహసయాత్ర) ప్రారంభమవుతోంది. కొడైకెనాల్‌లో త్వరలో కోడైవిళా (సమ్మర్ ఫెస్టివల్), 62 ఫల పుష్ప ప్రదర్శన నిర్వహించనున్నారు. ప్రస్తుతం కొడైకెనాల్‌కు వస్తున్న పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పర్యాటకుల కోసం ప్రత్యేక ఆకర్షణగా రాష్ట్ర పర్యాటక శాఖ, ప్రైవైట్ సంస్థతో కలిసి పారా సెయిలింగ్‌ను శుక్రవారం నుండి నాలుగు రోజులపాటు నిర్వహించనున్నారు. కొడైకెనాల్‌లోని 'మూంజికల్ మైదానం'లో ఈ సాహసయాత్ర ఏర్పాటు చేస్తున్నారు. గాలి వేగం, శీతోష్ణస్థితిని బట్టి ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు 15 యేళ్ల నుండి 60 యేళ్లలోపు వయస్సు కలిగిన పర్యాటకులను ఈ పారా సెయిలింగ్ చేయడానికి అనుమతిస్తారు. పారాసెయిలింగ్ ద్వారా ఆకాశంలో ఎగురుతూ కొడైకెనాల్‌లోని ప్రకృతి సౌందర్యాలను పర్యాటకులు తిలకించవచ్చునని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం ఈ పారాసెయిలింగ్‌ను ఎంత దూరం వరకు జరపాలనే విషయమై నిర్వాహకులు పారాచూట్‌లో ఎగురుతూ పరిశీలిస్తున్నారు. ఈ పారాసెయిలింగ్ చేయడానికి ఆసక్తికలిగిన పర్యాటకులు 73733 90531 అనే నెంబర్‌కు ఫోన్ తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.



ఎద్దులను అదుపుచేస్తున్న యువకులు

## రంకేసిన జల్లికట్టు ఎద్దులు

● పోరాడిన యువకులు

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా ఆలంగుడి సమీపంలోని పాపన్‌విడిదిలో శుక్రవారం జల్లికట్టు పోటీలు కోలాహలంగా జరిగాయి. ముత్తు మునీశ్వరర్ ఆలయ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీలను బీసీ సంక్షేమ శాఖ మంత్రి మెయ్యనాథన్ ప్రారంభించారు. పోటీల్లో పుదుకోట, తిరుచ్చి,తంజావూరు, దిండుగల్, మదురై సహా పలు జిల్లాలకు చెందిన 600లకు పైగా ఎద్దులు పాల్గొన్నాయి. వడివాసల్ నుంచి రంకెలేస్తూ వస్తున్న ఎద్దులను అదుపుచేసేందుకు రౌండ్లవారీగా సుమారు 300 మంది యువకులు పోటీపడ్డారు. ఎద్దుల దాడిలో గాయపడిన వారికి అక్కడే ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో చికిత్స అందించారు. ఎక్కువ ఎద్దులు అదుపుచేసిన యువకులు, ఎవరికి చిక్కకుండా వెళ్లిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. పోటీల సందర్భంగా ఆలంగుడి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## అన్బుమణికి వ్యాపారుల సంఘం అభినందన

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): మహాబలిపురం సమీపం తిరువిడందైలో 'చిత్తిరై యువజన మహానాడు' విజయవంతంగా నిర్వహించిన డా.అన్బుమణి ని వ్యాపారుల సంఘం నేతలు అభినందించారు. ఇటీవల ఆయన నివాసానికి వెళ్లిన నేతలు గజమాలతో ఆయనను సత్కరించి, వ్యాపారుల సమస్యలను ఈ మహానాడు ద్వారా ప్రజలకు తెలియజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శులు తిరుకచూర్ కె.ఆర్ముగం, అరియలూరు వైత్తి, చెంగల్పట్టు మధ్య జిల్లా పీఎంకే కార్యదర్శి కాయార్ ఏలుమలై, పసుమై తాయగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కన్నన్ తదితరులు ఉన్నారు.



అన్బుమణిని గజమాలతో అభినందిస్తున్న నేతలు

## వైద్యశిబిరంలో డ్రైవర్, క్లీనర్లకు పరీక్షలు



డ్రైవర్, క్లీనర్లకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్యారీస్, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరంలో లయన్స్ క్లబ్, డిస్ట్రిక్ 324జె, సీఎండీఏ ట్రక్ టెర్మినల్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో, ఎంజీఎం హెల్త్ కేర్ సహకారంతో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఇందులో లారీ డ్రైవర్లు, క్లీనర్లకు ఉచితంగా వైద్యపరీక్షలు అందించారు. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సుమారు 200 మందికి పైగా బ్లడ్ షుగర్, బీపీ, ఈసీజీ, నేత్ర, దంత పరీక్షలు చేశారు. సీఎండీఏ ట్రక్ టెర్మినల్ అధ్యక్షుడు లయన్ వీజీ జయకుమార్ సారథ్యంలో నిర్వహించిన మల్టీస్పెషాలిటీ స్క్రీనింగ్ క్యాంపులో వైద్య పరీక్షలతో పాటు మందులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు జీఆర్ షణ్ముగప్ప, పి.మణిశేఖర్, ఆర్.మనోహరన్, ఆర్‌కే రాధాకృష్ణమూర్తి, పి.జేసుదాస్, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పరివేక్షించారు.

## ఢిల్లీలో ఎన్‌ఎల్‌సీ 'జైహింద్ చక్ర'



జై హింద్ చక్రం వద్ద ఎన్‌ఎల్‌ఎసీ సీఎండీ ప్రసన్నకుమార్ మోటుపల్లి

అడయార్, మే 16 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని కొత్త పార్లమెంట్ భవనం సమీపంలో నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌ఎల్‌సీ) 'జై హింద్ చక్రం' ఏర్పాటు చేసింది. జాతీయ గౌరవం, పర్యావరణ స్పృహను తెలియజేసేలా స్క్రాప్ మెటల్‌తో దీన్ని రూపొందించారు. ఈ కళాత్మక సృష్టిని కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎన్‌ఎల్‌సీ ప్రత్యేక చొరవతో 'స్వచ్ఛతా హీ సేవా 4.0' ప్రచారంలో భాగంగా ఏర్పాటుచేశారు. 10 అడుగుల వెడల్పు, 10 అడుగుల ఎత్తుతో ఈ కళాఖండం రూపొందించారు. పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించేలా రూపొందించారు. ఇది జాతీయ సమగ్రత, సాంస్కృతిక వైవిధ్యం పట్ల ఎన్‌ఎల్‌సీకి ఉన్న అచంచలమైన నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందని ఎన్‌ఎల్‌సీ సీఎండీ ప్రసన్న కుమార్ మోటుపల్లి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. దీన్ని విజయవాడకు చెందిన ప్రముఖ శిల్పి, గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విభాగం ఫ్యాకల్టీ శ్రీనివాస్ తయారు చేశారని తెలిపారు.

## బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

వేలూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాహితం కోసం వేలూరు జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం జలకంఠేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలూరు బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు రాజా మాట్లాడుతూ, దేశ సంక్షేమం, ప్రజా శ్రేయస్సుకై జలకంఠేశ్వరాలయంలో విఘ్నేశ్వర కలశపూజ, పంచమూర్తుల అభిషేకం, శాంతి హోమం తదితర పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో మృతిచెందిన భారత సైనికుల ఆత్మశాంతి కలగాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు గణేష్, కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు వెంకట్, ఆర్గనైజర్లు సుబ్రమణ్యన్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.



● వడకాడు ఘర్షణ వ్యవహారం...

## జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ కమిటీ దర్యాప్తు

ప్యారీస్, మే 16 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా ఆలంగుడి సమీపంలోవున్న వడకాడు గ్రామంలో ఘర్షణలో నష్టపోయిన దళిత వర్గాల ప్రజలను జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్ కమిటీ శుక్రవారం విచారణ జరిపింది. వడకాడు గ్రామంలో ఈ నెల 5వ తేదీ రాత్రి నిర్వహించిన ఆలయ జాతరలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో 20 మందికి పైగా గాయపడ్డారు. ఆందోళకారులు గుడిసె, వాహనాలకు నిప్పంటించి, ప్రభుత్వ బస్సు, వాహనాలను ధ్వంసం చేశారు. దీనికి సంబంధించిన మొత్తం 20 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘర్షణపై మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్‌లో షణ్ముగం దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం జరిగిన విచారణకు పుదుకోట జిల్లా కలెక్టర్ ఎం.అరుణ, ఎస్పీ అభిషేక్ గుప్తా హాజరయ్యారు. ఘర్షణలకు సంబంధించి వడకాడు ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ పుటేజీని న్యాయస్థానంలో అప్పగించాలని జిల్లా యంత్రాంగం పోలీసుశాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ డైరెక్టర్ ఎస్.రవివర్మన్ నేతృత్వంలోని బృందం శుక్రవారం ఉదయం వడకాడు గ్రామానికి వెళ్లి పరిశీలించింది. బాధితుల వద్ద వివరాలు అడిగి తెలుసుకుంది. దర్యాప్తుకు సంబంధించిన నివేదికను రెండు వారాల్లోపు రాష్ట్రప్రభుత్వానికి సమర్పించనున్నట్లు రవివర్మన్ మీడియాకు తెలిపారు.



వడకాడు గ్రామంలో పరిశీలిస్తున్న జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ డైరెక్టర్ ఎస్.రవివర్మన్ బృందం

## ఎన్డీఏ కూటమిలోనే ఈపీఎస్, ఓపీఎస్

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

పెరంబూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఈపీఎస్, ఓపీఎస్ ఇద్దరూ జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ)లో కొనసాగుతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ స్పష్టం చేశారు. మదురైలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టేలా, ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను ఎంపిక చేసుకోవాల్సి ఉందన్నారు. ఒక పార్టీ అధ్యక్షుడు కూటమిపై నిర్ణయం తీసుకోవచ్చు, ఆ నిర్ణయం ఆ పార్టీకి సొంతమైందన్నారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దెదింపాలంటే అందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. కాగా, చెన్నై వచ్చిన అమిత్‌షా తమను కలుసుకోకపోవడంపై ఓపీఎస్ విచారణ వ్యక్తం చేశారనే విలేఖరి ప్రశ్నకు నయినార్ నాగేంద్రన్ స్పందిస్తూ.. అమిత్ షా వేరే విషయమై వచ్చిన కారణంగా ఓపీఎస్‌ను కలుసుకోలేదన్నారు. అలాగే, 2031, 2036లో కూడా డీఎంకే అధికారం చేపడుతుందని ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ... వాక్ స్వాతంత్ర్యం ఉందని, కానీ నిర్ణయం తీసుకోవాల్సింది ప్రజలు అన్నారు. ఎంజీఆర్ పార్టీ ప్రారంభించిన సమయంలో, ఒక పార్టీ అధికారం చేపడతామని చెప్పినా, ఆ పార్టీకి అధికారం కట్టబెట్టేది ప్రజలేనని అన్నారని నయినార్ నాగేంద్రన్ గుర్తుచేశారు.

### ప్రధాని మనసులో ఓపీఎస్‌కు ప్రత్యేక స్థానం: అన్నామలై

ప్రధాని నరేంద్ర మోదీ మనసులో ఓ.పన్నీర్‌సెల్వంకు ప్రత్యేక స్థానం ఉందని బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అన్నారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయాన్ని శుక్రవారం దర్శించుకున్న అన్నామలై మీడియాతో మాట్లాడుతూ..కేంద్ర మంత్రి పదవి వస్తే స్వీకరిస్తాను.అప్పటివరకు బోనులో ఉండేందుకు ఇష్టం లేదని, ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్నానని తెలిపారు. సమయం దొరికితే ఆలయాలకు వెళ్తున్నానన్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యటించేందుకు ఇది ఒక అవకాశం, అమ్మానాన్నలతో కూర్చుని భోజనం చేస్తూ ప్రశాంతంగా జీవిస్తున్నానని తెలిపారు. ఒక కార్యకర్తగా ప్రధానికి పని చేయాలని అనుకుంటున్నానని తెలిపారు. రాష్ట్రంలో మార్పు రావాలని కోరుకుంటున్నానని, ఆ కాలం త్వరలోనే రానుందని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 వినియోగించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లేవనెత్తిన ప్రశ్న సరైనదేనన్నారు.

## కొడైకెనాల్ బ్రెయింట్ పార్కు సందర్శన వేళల పెంపు

టి.నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలోని సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లోని బ్రెయింట్ పార్కు సందర్శన సమయాన్ని పెంచుతూ జిల్లా అధికారులు ఉత్తర్వు జారీ చేశారు. వేసవిలో కొడైకెనాల్‌ను సందర్శించడానికి వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. వేసవిలో నిర్వహించే ఫ్లవర్ షో తిలకించేందుకు కూడా వస్తారు. ప్రస్తుతం ఈ నెలాఖరున బ్రెయింట్ పార్కులో ఫ్లవర్‌షో నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు బ్రెయింట్ పార్కును సందర్శించేందుకు సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే అనుమతించేవారు. ఇకపై రాత్రి 7 గంటల వరకూ ఈ పార్కును సందర్శించేందుకు అనుమతినిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వు జారీ చేశారు.



# చిత్రజ్యోతి



ఆడియో రిలీజ్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మురుగదాస్

## షణ్ముగ పాండియన్‌తో 'రమణ-2' తీసేందుకు సిద్ధం

● ఏఆర్ మురుగదాస్

దివంగత నటుడు కెప్టెన్ విజయకాంత్ కుమారుడు షణ్ముగ పాండియన్‌తో 'రమణ-2' చిత్రాన్ని తీసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రముఖ దర్శకుడు ఏఆర్.మురుగదాస్ ప్రకటించారు. షణ్ముగ పాండియన్ తాజాగా నటించిన చిత్రం 'పడై తలైవన్' చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం నగరంలో తాజాగా జరిగింది. ఇందులో డీఎండీకే అధ్యక్షురాలు ప్రేమలత, డీఎండీకే నేత సుధీష్, దర్శకుడు ఏఆర్.మురుగదాస్, హీరో శశికుమార్, దర్శక నటుడు కస్తూరి రాజా, విజయ్‌కాంత్ కుమారుడు విజయ్ ప్రభాకరన్ సహా అనేక మంది సినీ ప్రముఖులు హాజరై ఆడియో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మురుగదాస్ మాట్లాడుతూ, 'రమణ' మూవీకి సీక్వెల్ తీసేందుకు నేను సిద్ధం. విజయ్‌కాంత్ కళ్ళలోని అదే పవర్ షణ్ముగ పాండియన్‌లోనూ కనిపిస్తోంది. తమిళ చిత్ర పరిశ్రమకు మరో గంభీరమైన హీరో లభించాడు. 'రమణ-2' నిర్మిద్దాం. కెప్టెన్ విజయకాంత్‌ను మళ్ళీ వెండితెరపై చూపిద్దాం. 'పడై తలైవన్' మూవీ చాలా బాగా వచ్చింది. సినిమాలో ఏనుగు, పులి నడిచివెళ్తున్నట్టుగా ఉందన్నారు. కాగా, ఈ చిత్రానికి యు.అన్బు దర్శకత్వం వహించగా, కస్తూరి రాజా, యామిని సుందర్, మునీష్‌కాంత్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు.

## రాఘవ లారెన్స్ హీరోగా 'బెంజ్'



కొత్త చిత్రం పూజా కార్యక్రమం

రాఘవ లారెన్స్ హీరోగా 'బెంజ్' పేరుతో ఓ మూవీ తెరకెక్కనుంది. యంగ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ నిర్మాణ సంస్థ జి స్క్వాడ్ పతాకంపై ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఒక వైపు దర్శకుడిగా బ్లాక్‌బస్టర్ హిట్ మూవీలను రూపొందిస్తూనే మరోవైపు సొంతంగా లోకేష్ చిత్రాలను నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో 'బెంజ్' చిత్ర పూజా కార్యక్రమం తాజాగా నగరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రాఘవ లారెన్స్, లోకేష్ కనకరాజ్, భాగ్యరాజ్ కన్నన్, సాయి అభయంకర్ సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ చిత్రం షూటింగ్ లోకేష్ కనకరాజ్ తొలిక్లాప్ కొట్టి ప్రారంభించారు. వీలైనంత త్వరగా షూటింగ్ పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని దర్శక నిర్మాతలు వెల్లడించారు.

## అన్ని అలవాట్లు మానేశా

● హీరో విశాల్



తనకున్న అన్ని దురలవాట్లను ఐదేళ్ళ క్రితమే మానేశానని హీరో విశాల్ చెప్పారు. గత కొన్ని రోజులుగా విశాల్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన హీరోగా నటించిన 'మదగజ రాజా' చిత్రం ప్రమోషన్ సమయంలోనూ ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కనిపించారు. తాజాగా విల్లుపురంలో జరిగిన కూవాగం కూత్తాండవర్ ఆలయ వేడుకల్లో పాల్గొన్న ఆయన హిజ్రాలతో మాట్లాడుతున్న సమయంలో ఉన్నట్టుండి స్పృహతప్పి కిందపడ్డారు. ఆ వెంటనే ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించి వైద్యం చేయడంతో కోలుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన తన ఆరోగ్యంపై వివరణ ఇచ్చారు. 'మద్యం, సిగరెట్ ఇలా అన్ని అలవాట్లను ఐదేళ్ళ క్రితమే మానేశాను. నన్ను విమర్శించే వారి గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదు. నాకు ఎలాంటి హాని జరగదు. త్వరలోనే మీ ముందుకు వస్తాను. నా కోసం ప్రార్థించిన మంచి హృదయాలకు ధన్యవాదాలు' అన్నారు.

## చెన్నై వచ్చేందుకు ఇష్టపడని సమంత



ప్రముఖ హీరోయిన్ సమంత చెన్నై వచ్చేందుకు ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. దీనికి అనేక కారణాలు లేకపోలేదు. సమంత ఆరోగ్యపరంగా, సినిమావకాశాల పరంగా కష్టాల్లో ఉన్న సమయంలో చెన్నైలోని స్నేహితులు, సినీ దర్శక నిర్మాతలు ఇలా ఏ ఒక్కరూ ఆదుకోలేదు. కనీసం ఆమెను పరామర్శించడం అటుంచితే ఓదార్చలేదు కూడా. సినిమా అవకాశాలు లేనిసమయంలో ఆమెకు సినిమా ఛాన్సులు ఇచ్చేందుకు ముందుకురాలేదు. ముఖ్యంగా ఆమెతో చిత్రాలు నిర్మించిన నిర్మాణ సంస్థలు, దర్శకులు, నిర్మాతలు, మంచి స్నేహితులైన హీరోలు, హీరోయిన్లు ఇలా అనేక మంది ఉన్నారు. ఇలాంటి అనేక విషయాలు సమంత మనసు నొప్పించాయి. దీంతో ఆమె చెన్నై వచ్చేందుకు ఆసక్తి చూపించడం లేదు. అయితే, ఏదైనా కార్యక్రమం ఉంటే మాత్రం అందులో పాల్గొనేందుకు వచ్చి వెళుతున్నారు. చెన్నైకు చెందిన సమంత తన స్థిరనివాసాన్ని హైదరాబాద్‌లో ఏర్పరచుకున్నారు. అందుకే ఆమె సొంతంగా నిర్మించిన 'శుభం' చిత్రాన్ని కూడా ఆమె తమిళంలో రిలీజ్ చేయలేదనే టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం సమంతకు చెన్నైలో ఉన్న ఏకైక స్నేహితురాలు విజయ్ టీవీ యాంకర్ రమ్య కావడం గమనార్హం.

## మామిడి రైతులను ఆదుకుంటాం

● గిట్టుబాటు ధరపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 16(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన మామిడి పరిశ్రమ యాజమాన్యం, రైతు సంఘ నాయకులు, వ్యాపారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నెలవారీగా వచ్చే మామిడి దిగుబడిని పరిశీలించి మద్దతు ధరకు చర్యలు తీసుకోవాలని ప్రాసెసింగ్ పరిశ్రమల ప్రతినిధులను కోరారు. కాయలు పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాత కోయడం వల్ల మార్కెట్‌లో లాభాలు పొందవచ్చునని రైతులకు సూచించారు. అటు రైతులు, ఇటు ఫ్యాక్టరీ యజమానులు నష్టపోకుండా స్థిరత్వం కలిగిన ధరలు నిర్ణయించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. పక్క రాష్ట్రాల నుంచి మామిడి పండ్లను దిగుమతి చేసుకోవడం వల్ల తాము నష్టపోతున్నామని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. మరోసారి ఉమ్మడి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి రైతులు, రైతు సంఘ నాయకులు, ఫ్యాక్టరీ యజమానులతో సమావేశమై చర్చిస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రేపు అండర్ 19, 23 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి(క్రీడలు), మే 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) ఆధ్వర్యంలో ఆదివారం అండర్ 19, 23 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు కరకంబాడి రోడ్డులోని కజారియా టైల్స్ ఎదురుగా వున్న సీవీ క్రికెట్ అకాడమీలో హాజరుకావాలని పేర్కొన్నారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామగ్రితో రావాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 9000214966, 8886185559లను సంప్రదించాలని కోరారు.


## సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 7 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**బుధవారం హుండీ ఆదాయం: రూ.3.72 కోట్లు**

**గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,208**

**తలనీలాలు సమర్పించినవారు: 32,951**





● జిల్లాలో 1.25లక్షల మంది రక్తపోటు బాధితులు

● అనధికారికంగా మరో రెండు లక్షలు పైనే










నేడు ప్రపంచ బీపీ డే

# బీపీ రేస్తోంది..!

ఆరోగ్యంలో అతి ముఖ్యమైన సమస్యగా బీపీ మారిపోయింది. ఒకప్పుడు వృద్ధాప్యంలో మాత్రమే బీపీ సమస్య మొదలయ్యేది. ఇప్పుడు వయసుతో నిమిత్తం లేదు. ముఖ్యంగా యువత అధిక రక్తపోటుకు గురవడమే ఆందోళనపెడుతోంది. జీవనశైలిలో వచ్చిన మార్పులే ఇందుకు ప్రధాన కారణమని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.ప తిరుపతి జిల్లాలో 1,24,607 మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని వైద్య వర్గాల గణాంకాల్లో నమోదైంది. నిజానికి బీపీ చెక్ చేసుకోనివారే అత్యధికంగా ఉంటారు. ఇలా చేస్తే ఈ సంఖ్య భయపెట్టేంత ఉండచ్చని అంచనా. అయితే నియంత్రణలో ఉంచుకుంటే బీపీకి జంకాల్సిన అవసరమే ఉండదు. రక్తపోటు నుంచి ఎలా తప్పించుకోవాలో, ఒకవేళ వస్తే ఎలా అధిగమించాలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, హార్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ అభిషేక్ కాషా 'ఆంధ్రజ్యోతి'కి ఇలా వివరించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

### 140/90 మించితే..

సాధారణ రక్తపోటు 120/80 ఉంటుంది. ఇది నిరంతరం 140/90 మించి ఉంటేనే బీపీ ఉన్నట్టుగా భావించాలి. ఎప్పుడో ఒకసారి ఇలా కనిపిస్తే ఆందోళన అవసరం లేదు. ఒత్తిడి, శారీరక శ్రమ వంటి తాత్కాలిక కారణాల వలన హఠాత్తుగా అధిక రీడింగ్ రావచ్చు. ప్రతిరోజు సాధారణం కంటే ఎక్కువ చూపిస్తేనే అధిక రక్తపోటుగా నిర్ధారించుకోవాలి. గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి వాటికి అధిక రక్తపోటు దారితీసే అవకాశం ఉంటుంది.

డాక్టర్ అభిషేక్ కాషా, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, హార్ట్ స్పెషలిస్ట్, తిరుపతి.

**ఇంట్లోనే చెక్ చేసుకోవచ్చు**

బీపీ ఎంత ఉందో తెలుసుకుంటూ ఉండడం ముఖ్యం. ఇందుకోసం ఆసుపత్రులకు వెళ్లిల్సిన అవసరం కూడా లేదు. చిన్న పరికరం ఇంట్లో ఉంచుకుంటే చాలు. ఇంట్లో పెద్దవాళ్లు ఉంటే తప్పనిసరిగా బీపీ చెక్ చేసుకుంటూ ఉండాలి.

**యువత సతమతం**

ఇటీవల యువతలో కూడా అధిక రక్తపోటు ఎక్కువగా కనిపిస్తుంది. ఇది జీవనశైలిలో వచ్చే మార్పులు, ఒత్తిడి, నిద్రలేమి వల్ల జరుగుతోంది. ఈ వయస్సులో రెండవ కారణాల్ని తప్పక పరిశీలించాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చాలామందికి బీపీ శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో లేదా ముందస్తు హెచ్చరిక సంకేతాలను ఎలా గుర్తించాలో పూర్తిగా తెలియదు. ఈ అవగాహన లేకపోవడం వల్ల బీపీని నియంత్రణలో పెట్టలేకపోతున్నారు. బీపీ నియంత్రణకు మెరుగైన మందులు అందుబాటులోకి వచ్చాయి. జీవనశైలి మార్పులు తోడైతే ఫలితాలు మరింత మెరుగవుతాయి.

### వేసవిలో ఇలా చేయండి..

బరువు నియంత్రణలో ఉంచుకోవాలి. తక్కువ ఉప్పు, తక్కువ కొవ్వు ఉన్న పదార్థాలే తీసుకోవాలి. మద్యం ఎక్కువైతే ప్రమాదమే. వ్యాయామం, ధ్యానం చాలా మంచి ఫలితాలను ఇస్తుంది. రక్తపోటును నివారించగల లేదా నియంత్రించగల ఆహారపు అలవాట్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ముఖ్యం. వేసవిలో లభించే పండ్లు కూరగాయల్లో ఏవి బీపీ నియంత్రణకు సహకరిస్తాయో స్విమ్స్ డైటీషియన్ డాక్టర్ కందారపు గీత ఇలా వివరిస్తున్నారు...

డాక్టర్ కందారపు గీత, డైటీషియన్, స్విమ్స్



**పుచ్చకాయ:** ఇది చాలా హైడ్రేటింగ్‌గా ఉంటుంది. ఇందులో ఎల్-సిట్రులైన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడంలోనూ, రక్తపోటును తగ్గించడంలోనూ సహాయపడుతుంది. ధమనుల పనితీరుకు మెరుగుపరుస్తుంది. దీనిలోని పొటాషియం కంటెంట్ శరీరంలో సోడియం ప్రభావాలను సమతుల్యం చేయడానికి కూడా సహాయపడుతుంది.



**దోసకాయ:** వేసవిలో రక్తపోటును నియంత్రించడంలో అద్భుతమైనది. కేలరీలు తక్కువగా ఉంటాయి. పొటాషియం అధికంగా ఉంటుంది, ఇది రక్త నాళాలను సడలించడానికి, మూత్రం ద్వారా అదనపు సోడియంను విసర్జించడానికి సహాయపడుతుంది,



**ఆకుకూరలు:** వేసవిలో దొరికే చాలా రకాలైన ఆకుకూరల్లో నైట్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి, రక్త నాళాలను వెడల్పు చేసి, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.



**కొబ్బరి నీళ్లు:** వీటిలో పొటాషియం, మెగ్నీషియం, ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి ద్రవ సమతుల్యతను నియంత్రించడంలో రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి.



**మామిడి పండ్లు:** ఫైబర్, పొటాషియం, బీటా-కెరోటిన్ కూడా పుష్కలంగా ఉంటాయి, ఇవి అధిక రక్తపోటును నిర్వహించడంలో సహాయపడతాయి.



**నిమ్మకాయ:** విటమిన్ సి ఫ్లేవనాయిడ్లు బీపీ నియంత్రణకి ఎంతో ఉపయోగం.

# వ్యాపారిని బురిడీ కొట్టించి...

● ఫోన్‌పే ద్వారా రూ.81వేల లూటీ ● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): చిల్లర దుకాణం వ్యాపారిని బురిడీ కొట్టించిన ఇద్దరు టక్కరి దొంగలు రూ.81వేలను స్వాహా చేశారు. బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఈ సరికొత్త సైబర్ క్రైం శ్రీకాళహస్తిలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి పట్టణం గాంధీవీధికి చెందిన మునస్వామి తిప్ప ప్రాంతం ఆర్టీసీ రోడ్డులో ప్రొవిజన్‌షాప్‌ను నిర్వహిస్తుంటాడు. బుధవారం రాత్రి ఇద్దరు యువకులు సరుకులు కొనుగోలు కోసం మునస్వామి దుకాణానికి వచ్చారు. రూ.5వేలకు సరుకులు కొనుగోలు చేసిన తరువాత తమ వద్ద రూ.వెయ్యి నగదు మాత్రమే ఉందన్నారు. మిగతా రూ.4వేలను ఫోన్‌పే చేసేందుకు తమ సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయిందని నమ్మించారు. దుకాణదారుడి సెల్‌ఫోన్ నుంచి తమ నాన్నకు ఫోన్ చేసి మిగిలిన రూ.4వేలను ఫోన్‌పై ద్వారా జమ చేస్తామని నమ్మించారు. దీంతో మునస్వామి వారికి ఫోన్ ఇచ్చాడు. ఒక యువకుడు దుకాణదారుడిని మాటల్లో పెట్టాడు. మరో యువకుడు మునస్వామి సెల్‌ఫోన్‌లో ఫోన్‌పేను ఆపరేట్ చేసి తిరిగి అప్పగించాడు. ఆ తరువాత కొనుగోలు కోసం వచ్చిన యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటి తరువాత బ్యాంకు ఖాతా నుంచి రూ.81వేలు నగదు మాయమైనట్లుగా మునస్వామికి మెసెజ్ వచ్చింది. దాంతో ఒకసారిగా ఏం జరిగిందోనని ఆందోళనకు గురయ్యాడు. సరుకుల కొనుగోలు కోసం వచ్చిన ఇద్దరు యువకులకు ఫోన్ ఇవ్వడం కారణంగా నగదు లూటీ అయినట్లు గుర్తించి బాధితుడు గురువారం శ్రీకాళహస్తి 1 టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈ ఘటనపై పోలీసు కేసు నమోదు కాలేదని బాధితుడు తెలిపాడు.

## హత్యకేసుపై ఎస్పీ సీరియస్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని జరిగిన హత్య ఉదంతంపై తిరుపతి ఎస్పీ హర్షవర్ధన రాజు సీరియస్‌గా స్పందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసరాల్లో గడచిన రెండు వారాల్లో మూడు అనుమానాస్పద మరణాలు, హత్య వెలుగుచూసిన విషయం తెలిసిందే. వరుసగా ఒంటరి వ్యక్తులు హతమవుతుండటంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 16న శుక్రవారం 'ఏం జరుగుతోంది' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఎస్పీ స్పందించారు. మొదట మూడు అనుమానాస్పద మరణాలు వెలుగులోకి వచ్చినప్పటికీ ఎందుకు ఆదిలోనే ప్రత్యేక దృష్టి సారించలేదని శ్రీకాళహస్తి పోలీసులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఇక నాల్గో ఘటన ముక్కంటి ఆలయ సమీపంలోని శ్మశాన వాటికలో గుర్తు తెలియని యువకుడిని దారుణంగా హతమార్చిన అంశంపై స్థానిక పోలీసులను లోతాగా ఆరా తీశారు. హత్య జరిగి మూడు రోజులు అయినప్పటికీ కనీసం హతమైన యువకుడు ఎవరు అన్న వివరాలను ఎందుకు గుర్తించలేకపోయారని నిలదీసినట్లు సమాచారం. మృతదేహానికి రక్తపు మరకలను కూడా మూడు రోజుల నుంచి ఎందుకు శుభ్రం చేయలేదని ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేయడంతో స్థానిక పోలీసు అధికారులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి చేరుకుని మృతదేహం ముఖంపై ఉన్న రక్తాన్ని శుభ్రం చేయించారు. హత్య జరిగిన శ్మశానానికి చేరుకుని ఆనవాళ్ల సేకరణ చేపట్టారు. వేగవంతంగా హత్య కేసును ఛేదించాలని ఎస్పీ స్థానిక పోలీసులను ఆదేశించారు. దీంతో రెండు బృందాలుగా పోలీసులు ఏర్పడి గాలింపు ముమ్మరం చేశారు.

# ప్రభుత్వ భూమికి అడ్డదారిలో డీకేటీ పట్టా!

● అడంగల్‌లో నమోదు

● ఫ్రీ హోల్డ్ భూముల పునఃపరిశీలనతో వెలుగు చూసిన వైనం

పుత్తూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ పరిధిలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. నందిమంగళం లెక్కదాఖలాల్లోని సర్వే నెం.6/2లో 3.76 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి అవినీతికి పాల్పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లను కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. 2003కు ముందు ప్రభుత్వ భూములకు పట్టా పొందిన లబ్ధిదారులకు సర్వ హక్కులు కల్పిస్తూ ఫ్రీహోల్డ్ పద్ధతిని అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఫ్రీహోల్డ్ ప్రక్రియలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని ఫిర్యాదులు అందడంతో ప్రస్తుత ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ఫ్రీ హోల్డ్ భూముల జాబితాను పునఃపరిశీలించాలని రెవెన్యూ శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్రీహోల్డ్ జాబితాను పరిశీలించిన రెవెన్యూ అధికారులకు వాస్తవాలు వెలుగు చూశాయి.

**ఏం జరిగిందంటే..**

చిత్తూరు సంతపేటకు వెంకటపెరుమాళ్ భార్య సుబ్బలక్ష్మమ్మకు 1991లో డీకేటీ పట్టా (నెం.52/4/91) జారీ చేసినట్లు నకిలీ పత్రం రూపొందించినట్లు ఆరోపణలున్నాయి. చిత్తూరుకు చెందిన మహిళకు పుత్తూరులో భూమి కేటాయించడంపై విమర్శలున్నాయి. అయితే, భర్త మరణానంతరం సుబ్బలక్ష్మమ్మ పుత్తూరులోని రెండో కుమార్తె నాగరత్నమ్మ వద్దకు వచ్చినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అప్పటికే 65 ఏళ్ల వయసున్న ఆమె.. కుమారులు బాలసుబ్రమణ్యం, హరినాథశెట్టి, శ్రీనివాసులు శెట్టి, కుమార్తెలు విజయ, నాగరత్నమ్మ, లలితకు వివాహాలు చేశారు. ఈ వివరాలను తన కుమార్తె నాగరత్నమ్మ పేరిట 1991 మే 7న రాసిన వీలునామాలో పొందుపరిచారు. అసలు 65 ఏళ్ల వయస్సులో సుబ్బలక్ష్మమ్మకు డీకేటీ భూమి ఎందుకు ఇచ్చారనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. కాగా, 2016 జనవరి 14న సుబ్బలక్ష్మమ్మ మృతి చెందారు. ఆ తర్వాత నాగరత్నమ్మ 2018 జూన్ 26న తన భర్త కుప్పుస్వామి పేరిట రిజిస్టర్ వీలునామా రాశారు. ఆయన కుమారుల పేరిట రిజిస్టర్ చేశారు. పాసుపుస్తకం, ఆన్‌లైన్ అడంగళ్‌లో పేర్లు నమోదు వంటివి శరవేగంగా జరిగిపోయాయి. వీరి కుటుంబం వైసీపీలో కొనసాగుతుండటంతో తమ పరపతిని వినియోగించి ఎవరికీ అనుమానాలు తలెత్తకుండా ఫ్రీ హోల్డ్ జాబితాలో చేర్పినట్లు విమర్శలున్నాయి. 3.76 ఎకరాలకు ఏడు అడుగుల ఎత్తుతో ప్రహరీ నిర్మించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఫ్రీ హోల్డ్ భూములను పునఃపరిశీలించే ఈ క్రమంలో ఈ విషయం వెలుగు చూసింది. రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో ప్రస్తుతం ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. 40 ఏళ్లుగా తమ ఆధీనంలో భూమి ఉందంటూ, మామిడి, ఇతర పంటలు వేసినట్లు కుటుంబ సభ్యుడు నరసింహారావు చెబుతుండటం గమనార్హం.

**అభ్యంతరకరంగా డీకేటీ జారీ**

డీకేటా పట్టా జారీ అభ్యంతరకరంగా ఉంది. నిబంధనలకు అనుగుణంగా పట్టాదారు వివరాలు రిజిస్టర్‌లో నమోదు కాలేదు. ఇవేవి లేకున్నా ఫ్రీహోల్డ్ జాబితాలో నమోదైంది. ఈ వివరాలను ఆర్డీవో, జేసీకి నివేదించా.

- వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు




# యువకుడిని ఢీకొన్న టిప్పర్

● పరిస్థితి విషమం ● గ్రామస్తుల ఆగ్రహం ● టిప్పర్‌ల అడ్డగింత

కోట, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడిని గ్రావెల్ టిప్పర్ ఢీకొంది. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో గ్రామస్తులు ఆగ్రహించారు. టిప్పర్లను అడ్డుకున్నారు. దీంతో సాగరమాల రోడ్డు పనులకు గ్రావెల్ సరఫరా చేసే వందలాది టిప్పర్లు ఆగిపోయాయి. స్థానికుల కథనం మేరకు.. కోట మండలం ఊనుగుంటపాళెం గ్రామానికి చెందిన యువకుడు అరుణ్‌తేజ గురువారం రాత్రి మైక్రో టవర్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా ఒక టిప్పర్ వేగంగా వచ్చి అతడిని ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ పరిస్థితి విష మంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ యువకుడిని చూసి గ్రామస్తులంతా ఊనుగుంటపాళెం వద్ద సాగర మాల రోడ్డు పనులకు గ్రావెల్ తరలిస్తున్న సుమారు వందకు పైగా టిప్పర్లను అడ్డుకున్నారు. యువకుడిని ఢీకొట్టిన టిప్పర్ డ్రైవర్ ముందుకు రావాలని కోరారు. ఎవ్వరూ రాకపోవడంతో రోడ్డుపైనే సాయంత్రం వరకు టిప్పర్లను కదలనివ్వలేదు.




ఊనుగుంటపాళెం వద్ద టిప్పర్‌లను అడ్డుకుని ఉన్న గ్రామస్తులు

# ఏఎంపురంలో మళ్లీ గ్రావెల్ తవ్వకాలు

సత్యవేడు, మే 16 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం ఏఎంపురంలో గ్రావెల్ తవ్వకాలు మళ్లీ జోరందుకున్నాయి. ఇక్కడి ప్రైవేట్ భూముల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రావెల్ తవ్వకాలకు ఐదేళ్ల కాలపరిమితికి అనుమతులు పొందిన కొందరు చెన్నైకు చెందిన మట్టి మాఫియా మళ్లీ జూలు విదిలిస్తోంది. అప్పటి అనుమతులను అడ్డం పెట్టుకుని గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్నారు. నాలుగేళ్లుగా అడ్డు అదుపులేకుండా సాగించిన గ్రావెల్ రవాణా ధాటికి సత్యవేడు- టీపీకోట రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రజలు ఇప్పటికీ కష్టాలు అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పది నెలలుగా స్తబ్దుగా ఉన్న మట్టి మాఫియా మళ్లీ పేట్రేగుతోంది. నాలుగు రోజులుగా పదుల సంఖ్యలో టిప్పర్లతో రాత్రి, పగలు తేడా లేకుండా చెన్నైకు గ్రావెల్ తరలిస్తున్నారు. టిప్పర్లను రోడ్డుకిరువైపులా భారీగా నిలిపి వేయడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి. మరో వైపు ఏఎంపురంలో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతానికి సమీపంలోనే రిజర్వ్ ఫారెస్ట్ కూడా ఉంది. ఈ అటవీ ప్రాంతంలో నెమళ్ళు, జింకలు తదితర వన్యప్రాణులు విరివిగా ఉన్నాయి. ఈ గ్రావెల్ తవ్వకాల పర్యావరణ, జీవవైవిధ్యానికి విఘాతం కలుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి గ్రావెల్ తవ్వకాలను నియంత్రించాల్సిన అవసరం ఉంది.



ఏఎంపురంలో జరుగుతున్న గ్రావెల్ రవాణా

## శ్రీవారి సేవలో జాస్తి చలమేశ్వర్

తిరుమల, మే16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి, 16వ ఆర్థిక సంఘం సభ్యుడు సౌమ్య కాంతి ఘోష్, తెలంగాణ ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ప్రముఖ సినీనటుడు కృష్ణ సోదరుడు, సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరి రావు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



ఆలయం ముందు జస్టిస్ జాస్తి చలమేశ్వర్

## ఇద్దరు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్‌లు

కోట, మే 16 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం కేశవరం సచివాలయంలో పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్ అనీల్, వ్యవసాయశాఖ అసిస్టెంట్ శివకుమార్‌లకు శుక్రవారం ఎంపీడీఓ దిలీప్‌కుమార్ నాయక్ షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వెల్ఫేర్ అసిస్టెంట్ పేదల పెన్షన్‌కు సంబంధించి రూ2.40లక్షలు, మరో రూ 50వేలను డీఆర్‌డీఏ కార్యాలయానికి చెల్లించకుండా స్వాహా చేశారని ఎంపీడీఓ తెలిపారు. దీనిపై రెండు రోజుల్లోగా నగదు చెల్లించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా వ్యవసాయ అసిస్టెంట్ శివకుమార్ విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.

## వడదెబ్బకు మహిళా రైతు మృతి



వసంత నిర్మల (పాతచిత్రం)

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం చిట్టత్తూరు పంచాయతీ పరిధిలోని రామలింగాపురం రాజులకండ్రిగకు చెందిన వసంత నిర్మల(39) వడదెబ్బకు గురై మృతి చెందారు. గురువారం ఎండలో పొలంలో పని చేసుకుంటూ అక్కడ వడదెబ్బకు గురై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం తొట్టంబేడు రెవెన్యూ అధికారులు సర్వే చేసేందుకు వచ్చారు. వసంత పొలంతో పాటు ఐదుగురు రైతులకు చెందిన పొలాల్లో గతంలో బాట ఉండేదని అందుకు అధికారులు సర్వే చేసేందుకు అక్కడికి చేరుకున్నారు. దీనికి వసంత అభ్యంతరం చెప్పడంతో పాటూ వారితో వాగ్వాదానికి దిగింది. అనంతరం పొలం పనులు చేస్తూ తీవ్రమైన ఎండకు అస్వస్థతకు గురై పొలంలోనే మృతి చెందింది.